# లిట్మస్ టెస్ట్


— శరచ్చంద్ర

''లవ్ ఎట్ ఫస్ట్ సైట్''

— నా దృష్టిలో ఇంపాసిబుల్!

''ఎట్రాక్షన్ ఎట్ ఫస్ట్ సైట్''

— యస్ ... సెంట్ పెర్సెంట్!!



అతనికి కలిగింది... ప్రేమ కాదు... ఇన్ ఫాట్యుయేషన్... ఆ స్థితి కలిగే వయసు నుండి నేనేనాడో ఎదిగానని ఇతనికెలా చెప్పడం?

* * *

పున్నమి వెన్నెల చల్లగా కాస్తోంది.

ఉండుండి వంటిని తాకుతోన్న చిరుగాలి ఆహ్లాదంగా వుంది.

ఒకట్రెండు నక్షత్రాలు ఆకాశంలో ముత్యాల్లా మెరుస్తున్నాయి.

ఎదురింటి మాష్టారింట్లో నుండి ఘంటసాల 'పుష్పవిలాపం' కమనీయంగా విన్పడ్తోంది. మధ్య మధ్యలో, లేటుగా కాలేజి నుండి యింటికొచ్చిన కూతుర్ని, పాటలు తప్ప పరిస్థితుల్ని పట్టించుకోని భర్తను కలిపి మాష్టారి భార్య చదువుతున్న దండకం కర్కశంగా వుంది.

కుడిపక్కింటి రిటయిర్డ్ యింజనీర్ రావుగారు, ఆయన భార్య లాన్‌లో కూర్చుని, జ్యూస్ చప్పరిస్తూ, బొచ్చుకుక్కతో ఆడుకుంటున్నారు.

ఎడమ పక్క యింట్లో — మాధవరావు — పేకాటకు డబ్బులు యివ్వని భార్యను నానా మాటలు అంటున్నాడు.

మామూలుగా అయితే—చక్కని ఈ ప్రకృతిని, చుట్టుప్రక్కల మనుష్యుల వికృతుల్ని — విశ్లేషిస్తూ గడపడం నా అలవాటు. అందుకే అమ్మ అంటూంటుంది — డాబా మీద కుర్చీ వుంటే చాలు, దీనికిక భోజన నిద్రలు గుర్తుకురావని.

కాని, ఈ రోజు నా మనసు వీటి మీద లేదు.

ప్రేమ గురించి ఆలోచిస్తోంది — సూర్యం గురించి యోచిస్తోంది.

నేను సూర్యాన్ని ప్రేమిస్తున్నానా?

సూర్యం నన్ను నిజంగా ప్రేమిస్తున్నాడా? లేక కేవలం నా మీద ఆకర్షణ, జాలేనా??

అసలు ప్రేమంటే ఏమిటి?

ప్రేమ రెండు హృదయాల కలయికా? అసంభవం.

ప్రేమ గుడ్డిదా? అయిండొచ్చేమో.

'ప్రేమంటే రెండే అక్షరాలు — కాని దాని భావం సముద్రం కన్నా లోతైనది' అన్నార్ట ఎవరో — నాకు నమ్మకం లేదు.

ప్రేమ గురించి అనేకుల అభిప్రాయాలు, 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అనే ప్రయోగాలు విన్నాను గాని, అవన్నీ వట్టి ట్రాష్ అని నా అభిప్రాయం.

నా దృష్టిలో ప్రేమ కూడా అభిమానం, ఆప్యాయతల్లాంటి ఓ భావం — ప్రేమించుకోవడం అంటే స్నేహించడం — ఒకర్నొకరు అర్థం చేసుకోవడం.


'మో'గారన్నట్టు 'ప్రేమంటె ఓ మెమొరీగా మిగిలి, తలుచుకుంటే చిర్నవ్వు కదిలే ఫీలింగ్'.

నేను మరీ మెటీరియలిస్టిక్‌గా ఆలోచిస్తున్నానా?

ఓ సారి నా కొలీగ్ సుజాత నా కిచ్చిన లెక్చర్ జ్ఞాపకమొస్తోంది.

''నువ్వొత్త మెటీరియలిస్ట్‌వే అనూ! నువ్విలాగా, మనసులోని భావాల్ని, హృదయస్పందనల్ని — నీ నుండి విడిగా చేసి కొలుస్తూ పోతుంటే, నీలోని మృదుత్వం మరుగైపోయి, నీ వేలికొసల్నుండి జీవితం జారిపోగలదు జాగ్రత్త! జీవితాన్ని అర్థం చేసుకో అనూ! చాలు ... విశ్లేషించకు.. ఆనందించు... ఎంజాయ్ చెయ్... ప్రాక్టికాలిటీస్ గురించి పాకులాడకు — నాకు పెద్ద పెద్ద మాటల్రావ్ — జీవితాన్ని అద్భుతంగా చిత్రించాడని, నీవు చెప్తూండే, బుచ్చిబాబు రచనలు నే చదవలేదు. కాని, చలం మ్యూజిగ్స్‌లో ఎప్పుడో చదివిన ఓ విషయం గుర్తొస్తోంది. ఓ రోజు, పరీక్షలు వ్రాస్తున్న పిల్లలకు కాపలాగా కూర్చుని, విసుగుచెందుతోన్న చలానికి — ఓ చిన్న పువ్వు అమితమైన ఆనందాన్ని, ఆ విసుగు లోంచి బయట పడగలిగే స్పందనను కల్గించిందట. క్లాస్ రూమ్ వదిలి వెళ్ళిపోతూ, దాన్ని చూస్తే.. ఏముంది.. అదొక చిన్న వుండగా చుట్టిన ఎర్ర కాయితం — ఎందుకు విమర్శగా తను దాన్ని చూశానా అని బాధపడ్డాడు.

"నీలో — ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ నుండి భౌతికవాదం జనించిందేమోనని నా అనుమానం — అది అంత మంచిది కాదు. అయినా నీకేం తక్కువని అనూ — ఒక కాలు లేదు, అంతే కదా! ఈ ప్రపంచంలోని అందాల్ని చూడడానికి నోచుకోని వాళ్ళు, కాళ్ళు చేతులు లేక వేరొకరి మీద ఆధారపడి బతికేవాళ్ళ కన్నా ఎంతో మేలని అనుకోవేం — నువ్వే యిలా బాధపడ్తోంటే, వాళ్ళు బహుశ ఆత్మ



హత్యలు చేసుకోవాలేమో! ఈ ప్రపంచంలో వికలాంగుల కన్నా — మానసిక వికలాంగులే... అంటే కుత్సిత మనస్కులే ఎక్కువ.. వాళ్ళని చూసి బాధ పడు ... నీ గురించి కాదు."

ఆ లెక్చర్ విన్న నేను స్థాణువైపోయాను.

ఎప్పుడూ — జీన్ ప్యాంట్, టీ షర్ట్‌తో, చేతిలో లుడ్‌లమ్ నవల్నో, క్రిస్టీ నవల్నో పట్టుకుని తిరిగి సుజాత యిదేనా అని

ఒంట్లో బాగులేదని, తన చేత మేనేజర్‌కు లీవ్ లెటర్ పంపి, చిరంజీవి సినిమా రిలీజ్రోజు, మొద టాటకే వెళ్ళే సుజాత యిదేనా అని —

జీవితం గురించిన దాని అవగాహన.. ఆ డెప్త్... నాకు ముచ్చటేసింది.

బాహ్య రూపం మానసిక స్థితిని ప్రతిబింబిస్తుందని నేనెక్కడో చదివిన విషయానికి ఎక్సెప్షన్స్ వున్నాయని నాకా క్షణంలో బాగా అర్థమైంది.

కాని.. సుజాత తనను పూర్తిగా అర్థం చేసుకోలేదు.నా మెటీరియలిజమ్,ఇన్‌ఫీరియారిటీకాంప్లెక్స్ నుండి పుట్టిందేమోనన్న దాని అనుమానం, నాకు యిప్పటికీ నవ్వు తెప్పిస్తుంది.

నాలోని భౌతికవాదం — నేను పెరిగిన పరిసరాలు, నా పరిస్థితి వల్ల, వచ్చిన మానసిక ఎదుగుదల నుండి పుట్టిందని అది గ్రహించలేదు.

ఒకటి మాత్రం నిజం — దాని లెక్చర్ నా మనసు మీద బలమైన ముద్ర వేసింది. నా మనసు చుట్టూ అల్లుకున్న దిగులు పొరల్ని ఛేదించింది. సంవత్సరాలుగా పేరుకున్న స్తబ్ధతను, నిశ్శబ్దతను పారద్రోలింది.

చిన్నతనంలోనే, మిగిలిన వారి కన్నా నేను వేరు అనే భావం నాలో యింకిపోయింది.

మిగిలిన పిల్లలంతా నా అవిటితనాన్ని చూసి జాలి చూపించేవారు. చుట్టుపక్కల వాళ్ళు — 'చిదిమి దీపం పెట్టుకోవచ్చమ్మా — ఆ దేముడు, పాపం, ఆ అవిటితనం లేకుండా చేసుంటే, ఎంత బావుండేది' — అంటుండే వాళ్ళు.

ఎవరికీ తెలియకుండా, ఒంటరిగా కూర్చుని, మెదుల్లా అబ్లాంగేటా పగిలేలా ఏడ్చేదాన్ని. నా కన్యాయం చేశాడని దేముడ్ని నానాతిట్లు తిట్టేదాన్ని—

రానాను చదువులో పడ్డాక, ఆటల మీద నుండి, అసూయ మీద నుండి దృష్టి మార్చుకుని, చదువునే ధ్యేయంగా మలచుకున్నాను. క్లాసు పుస్తకాలే కాదు — బుచ్చిబాబు, చలం, గోపీచంద్, తిలక్, శ్రీశ్రీ, ముళ్ళపూడి, రావిశాస్త్రి, మార్క్స్, గోర్కీ ... ఒకరనేమిటి — జీవితాల్ని, తాము నమ్మిన సిద్ధాంతాల్ని, రచనల్లో ఆవిష్కరించిన — అందర్నీ చదివి జీర్ణం చేసుకోవాలని ప్రయత్నించాను.

ఆ రచనలు నా 'ఎదుగుదల'కు ఎంతో దోహదపడ్డాయి. అందుకే యిరవై ఏళ్ళకే నేను, నలభై ఏళ్ళ వ్యక్తికుండే మానసిక స్థితిని పొందానేమోనని నా అభిప్రాయం.

అబ్బాయిల్నాకర్షించాలని అమ్మాయిలు చేసే ప్రయత్నాలు, ఫిక్షన్ నవలలు, చిరంజీవి మీద క్రేజ్ అన్నీ నాకు చిన్నపిల్లల చేష్టల్లా కన్పడ్తాయి.

నా అవిటితనం నాకు — సామాజికంగా (మనుష్యుల మాటల్ని, మనస్తత్వాల్ని అర్థం చేసుకోవడానికి), హార్దికంగా (నా మనోవికాసానికి)నే కాదు, ఆర్థికంగా (బాంక్‌లో క్యాషియర్ వుద్యోగం దొరకటానికి) కూడా తోడ్పడింది.

అమ్మ అప్పుడప్పుడు నాన్నను నా పెళ్ళి గురించి సతాయిస్తూ వుండడం ఒకట్రెండుసార్లు విన్నాను గాని, నాకు మాత్రం ఏ ఆలోచనా లేదు — సూర్యం నా జీవితంలో అడుగుపెట్టే వరకు.

సూర్యం పి.డబ్ల్యు.డి.లో ఎక్కవుంటెంట్.క్యాష్ కోసం ... డ్రాఫ్టుల కోసం... వేరే పన్ల మీద మా బ్యాంక్‌కు తరచూ వస్తూండేవాడు.

చూడడానికి బాగానే వుంటాడు. అతనొస్తే చాలు, అందరూ వుత్సాహంగా పలకరించేవారు. అందరితో సరదాగా కబుర్లు చెప్తూ, తన పని చూసుకుని వెళ్ళిపోతూండేవాడు. నేను అందరు కస్టమర్లలాగే అతన్నీ ట్రీట్ చేసేదాన్ని —

ఓ రోజు, నేను క్రచెస్‌తో వెళ్ళడం చూసి, ఆశ్చర్యంగా నుల్చుండిపోయాడు. అతని ముఖంలో జాలి, బాధ నాకు చక్కగా తెల్సాయ్, ఆ క్షణాన..

ఆర్నెల్ల తర్వాతనుకుంటాను—ఓ రోజు సడెన్‌గా, నేను యింటికెళ్ళే దారిలో కనపడి, "మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు.

నేను ఆశ్చర్యంగా చూశాను. ఏం మాట్లాడాలన్నట్లు చూశాను.

"నాది కొంచెం ముక్కుకు సూటిగా పోయే వ్యవహారం... ముక్కు దూలం పగిలిపోగలదని మిత్రులప్పుడప్పుడు హెచ్చరిస్తూ వుండేవాళ్ళు కూడా" అన్నాడు చిర్నవ్వుతో వుపోద్ఘాతంగా.

నేను నవ్వలేదు — విషయ మేమిటన్నట్లు చూశాను.

**"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీకు కూడా నేనంటే యిష్టమైతే, పెళ్ళి చేసుకోవటానికి రెడీ" అన్నాడు.**

అది నేనూహించని పరిణామం. ఏ వ్యక్తయినా నన్ను ప్రేమిస్తున్నానంటూ వస్తాడన్నది నా వూహకందని విషయం.

నా మనస్సుకు రెక్కలొచ్చి, ఆకాశంలో ఎగుర్తున్న అనుభూతి క్షణం సేపు కదలాడింది.

బహుశ యిలా జరిగితే బాగుండని నా 'యిగో' కోరుకుంటుందేమో—లేకుంటే, ప్రతి విషయాన్నీ సునిశితంగా విశ్లేషించి చూడడానికి అలవాటుపడ్డ నాలో, ఈ భావ ప్రకంపన లేమిటి?

"మనకు పరిచయం కూడా అట్టే లేదు. నా గురించి మీకేం తెల్సని — ప్రేమించానంటున్నారు" నాలోని భౌతికవాది ప్రశ్న.


"లవ్ ఎట్ ఫస్ట్ సైట్ — మొదటి చూపులోనే నాకు నచ్చారు. మీరు నాకు తెల్సు... పేరు అనూరాధ... బి.కాం. చదివారు. బ్యాంక్‌లో క్యాషియర్.. ఇక నా గురించంటారా.. నా పేరు మీకు తెల్సు — అయినా మరోసారి చెప్తాను.. ఎ.వి. సూర్యనారాయణ — పి.డబ్ల్యు.డి.లో ఎక్కవుంట్స్ సెక్షన్‌లో క్లర్క్‌ని ... జీతం పదిహేడొందలు... బరువులు, బాధ్యతలు అట్టే లేవు — నాన్న రిటయిర్డ్ స్కూల్ టీచర్.. అమ్మా, నాన్న మా స్వంత వూళ్ళో వుంటున్నారు.. ఇంకా ఏమన్నా వివరాలు కావాలంటే అడగండి... చెప్తాను" అన్నాడు సూర్యం నవ్వుతూ.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్'- నా దృష్టిలో ఇంపాజిబుల్ 'ఎట్రాక్షన్ ఎట్ ఫస్ట్ సైట్' ... యస్...

అతనిక్కలిగింది.. ప్రేమ కాదు.. ఇన్‌ఫాట్యుయేషన్.. ఆ స్థితి కలిగే వయసు నుండి నేనేనాడో ఎదిగానని యితని కెలా చెప్పడం —

"నా అవిటితనం తెల్సి కూడా...?" పూర్తిచేయలేదు. ఒకప్పుడు, తెలియని కొత్తపిల్లలెవరైనా ఆటలకు రమ్మనమని పిల్చినపుడు, అవిటిదాన్ని అని చెప్పకోడానికి ఎక్కిళ్ళు అడ్డమొచ్చేవి.

**"అవిటితనం శరీరానికేగాని, మనసుకు కాదుగా.. ప్రేమ కేవలం శరీరానికే సంబం**



ధించిందయితే, దాన్ని ప్రేమ అనరు... కామం అంటారు'' అన్నాడు సూర్యం.

అతని మాటల్లోని నిజాయితీకి ఆశ్చర్యపోయాను. ఆ నిజాయితీనే అతన్ని గురించి నేను సీరియస్‌గా ఆలోచించేటట్లు చేసింది.

"నాకు... నాకు కొంచెం టైమివ్వండి... ఆలోచించుకోవడానికి..." అన్నాను.

సూర్యం ఈ సమాధానాన్ని ఎక్స్‌పెక్ట్ చేసినట్లు లేదు. "మీ యిష్టం" అన్నాడు.

నేను అందరాడపిల్లల్లాగే వుంటే, ఏమీ ఆలోచించే దాన్ని కాదేమో. బహుశా, సూర్యం లాంటివాడడిగితే, ఎగిరి గంతేసి వప్పుకుని వుండేదాన్నేమో (అప్పుడు, బహుశా, నా పట్ల ఆకర్షితుడయ్యేవాడు కాదేమో)!

నాకు ఒకటే అర్థం కాలేదు.

సూర్యంకు నిజంగా నా పట్ల ప్రేమ (?) వుందా? లేక కేవలం కుంటిదాన్నన్న జాలేనా?

ఓ కుంటి పిల్లను చేసుకుని, తన విశాల హృదయాన్ని, సంఘసంస్కరణాభిలాషను ప్రపంచానికి చాటాలనా?

లేక నా సంపాదన పట్ల ఆశా?

చివరిది నాకు నిజమన్పించలేదు. అతను కోరుకుంటే, వుద్యోగం చేసే పిల్లలే దొరుకుతారు.

మరి మిగిలిన రెంటిలో ఏది?

ఎవర్ని అడగాలి సలహా —

ఎవర్నడిగినా ఏమంటారో నాకు తెల్సు — "ఏమిటే నీ మొహం యింకా ఆలోచించేది — వేలకు వేలు కట్నాలు పోసినా, పెళ్ళిళ్ళలా అవుతాయని సలక్షణమైన కన్నెలంతా ఆందోళన చెందుతూంటే —నీకున్న అవిటితనానికి తోడు—అదృష్టం అడక్కుండా కాళ్ళదగ్గరకొస్తే...యింకా ఆలోచనేమిటి?"

కాని... నేను ప్రతి విషయాన్నీ భూతద్దంలోంచి చూడడానికి అలవాటు పడ్డదాన్ని — సాటి మనుషుల జాలి, ఎగతాళుల మధ్య నుండి ఎదిగిన దాన్ని — జీవితం గురించి ఓ స్పష్టమైన అవగాహన కొచ్చినదాన్ని — పెళ్ళి గురించిన విషయాన్ని అంత తేలిగ్గా ఎలా తీసుకోగలను!

రేపు, ఆవేశం దిగాక, నన్ను చేసుకున్నందుకు సూర్యం బాధపడ్తే.. పశ్చాత్తాప పడ్తే...

జీవితాన్ని నేను అప్పుడు భరించలేను...

నాకు యింటర్లో చదువుకున్న లిట్మస్ టెస్ట్ గుర్తొచ్చింది — ఏసిడో, బేసో కనుక్కోవటానికి వాడేవాళ్ళం... ఎర్ర లిట్మస్‌ను, నీలి లిట్మస్‌ను...

సూర్యం ప్రేమకో చిన్నపరీక్ష పెట్టదల్చుకున్నాను.

ఎర్రటి భావాలతో నిండి వున్న సూర్యం మనసు నా టెస్ట్‌కు నీలంగా మారుతుందా లేక ఎర్రగానే నిలబడ్తుందా చూడాలనుకున్నాను.

మర్రోజు సూర్యం రాగానే, "అలా పార్కు కెళ్దామా" అన్నాను. ఇద్దరం కాలి నడకన బయల్దేరాం.

నా క్రషెస్ మోత తప్ప,యిద్దరి మధ్యా నిశ్శబ్దం-

"నువ్వు నడవలేవేమో— ఆటోలో వెళ్దాం' అన్నాడు సూర్యం.

నా గురించి అతను చూపే కన్సర్న్ నాకు తృప్తినిచ్చింది. "జీవితాంతం నీతో నడవాలనే నిర్ణయం తీసుకోవాల్సినదాన్ని.. ఈ దూరం భారం కాదులే" అన్నాను నవ్వుతూ.

ఏవేవో మాట్లాడుకున్నాం.

ఆ విధంగా, రోజూ పార్కుకో, సినిమాకో.. సెంటర్‌కో.. తరచూ వెళ్తూ వుండేవాళ్ళం..

అక్కడ పరిచయస్తులు, స్నేహితులు ఎందరో కలుస్తూ వుండెవారు. అంతా నా మీద జాలి చూపేవారు.

కొందరు, విషయం చూచాయగా గ్రహించి, సూర్యం విశాల భావాల్ని మెచ్చుకునేవారు. సూర్యం పొంగిపోయేవాడు.

మరికొందరు "యిదేం పనోయ్" అనే వారు ... సూర్యం మట్లాడేవాడు కాదు. వినీవిననట్లు వూరుకునేవాడు. "వాళ్ళ గురించి పట్టించుకోక" అనేవాడు నాతో...

ర్రానాను "ఆ వెధవలు కన్పడ్తారుగాని, ఆటోలో వెళ్దాం" అనేవాడు.

ఓ రోజు —

"ఏమిటిది అనూ! అందరాడపిల్లలూ, అబ్బాయిలు సినిమాలకు, షికార్లకు రమ్మంటే తప్పించుకుంటూ, పెళ్ళి పెళ్ళి అని వేధిస్తూంటారని విన్నాను. మరి నువ్వేమిటి? పెళ్ళి మాటెత్తితే, ఏదో కబుర్లు చెప్తూ, పార్కులూ, సినిమాలు అంటావ్" అన్నాడు.

"మరి ప్రేమంటే ఒకర్నొకరు అర్థం చేసుకోవద్దా" అన్నాను తప్పించుకుంటూ...

నిన్న సూర్యం చిన్ననాటి స్నేహితుడట.. కన్పించాడు.

నాకు వినపడదనుకొని "ఇదేమిట్రా.. నీకీ కుంటి పిల్లే దొరికిందా? కో అంటే కోటి మంది సలక్షణమైన పిల్లలు క్యూలలో నిలబడతారే.. నువ్వు..వూ .. అనుచాలు" అన్నాడు.

సూర్యం మాట్లాడలేదు.

నాకు అల్టిమేటం యిచ్చాడు రెండ్రోజుల్లో — పెళ్ళెప్పుడో తేల్చి చెప్పమని.

నిన్న, ఈ రోజంతా ఆలోచించాను.

నేను పెట్టిన టెస్ట్ రిజల్ట్స్ బేరీజు వేసుకున్నాను.

**'ప్రేమంటే కలిసి బతకడం ... కలిసి కష్టసుఖాలు పంచుకోవటం' అన్నారొక రచయిత.**

ఏదైనా ఫంక్షన్లో, "కుంటిదా నీ భార్య?" అనెవరైనా అడిగితే, ఏదో అపరాధం చేసినవాడిలా తలదించుకునేలా వుండకూడదు నా భర్త. "అవును, అయితే ఏం" అనడిగేవాడిలా వుండాలి.

ఇప్పుడే "ఎవరైనా ఏమన్నా అంటారు - ఆటోలో వెళ్దాం" అనే సూర్యం, రేపు పెళ్ళయ్యాక మాత్రం ఎందుకనడు?

నేను సూర్యానికేం చెప్పాలో నిర్ణయించుకున్నాను.

"తప్పు చేస్తున్నావేమో... మరోసారి ఆలోచించకూడదూ' అన్నాడు నాన్న... నానిర్ణయం మారదని చెప్పాను.

నా కింకా అనుమానమే..

నేను చేస్తున్నది తప్పా? ఒప్పా? ●

## చరిత్రహీన్ టి.వి. సీరియల్

బొంబాయి నుంచి కృష్ణ రాఘవ ప్రొడక్షన్స్ సంస్థ, ఏ వారానికి ఆ వారం ఆయా ఎపిసోడ్స్ చిత్రీకరణ పూర్తి చేసుకున్న తరువాత, స్క్రిప్ట్‌ని ఆ మేరకు మళ్ళీ సవరించి పంపడంలో సాంకేతిక పరంగా యిబ్బందులు ఎదురై సకాలంలో పేర్పలేక పోతున్నారు. ఈ కారణంగా లోగడ ఒకటి రెండు సంచికలలో 'చరిత్రహీన్' అచ్చు వేసిన భాగానికి, టెలికాస్ట్ అయిన ఎపిసోడ్‌లకి తేడాలు వుండడం, కొన్ని సందర్భాలలో ప్రచురించిన భాగాన్నే తిరిగి అచ్చు వేయవలసి రావడం జరిగినటు మా పాఠకులకు తెలుసు. ఇన్ని సాంకేతిక కారణాల వల్ల ఆంధ్రదేశం లోని బెంగాలీ సాహితీ ప్రియులకు 'చరిత్ర హీన్' బుల్లితెర సంభాషణలను యథాతథంగా అనువదించి అందించాలన్న మా మౌలిక లక్ష్యమే దెబ్బతింటున్నందు వల్ల - అనివార్యంగా 'చరిత్ర హీన్' ధారావాహిక ప్రచురణను యీ సంచిక నుంచే ఆపి వేయాలన్న నిర్ణయం తీసుకొనవలసి వచ్చింది. పాఠకులు సహృదయంతో గ్రహించగలరు.

—ఎడిటర్